www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 30 మార్చి 2023

5

ఏలూరు



ఏలూరు అర్బన్ మండలం ఏర్పాటుకు నోటిఫికేషన్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

జిల్లా కేంద్రంగా ఉన్న ఏలూరు మండలాన్ని ఏలూరు అర్బన్, రూరల్ మండలాలుగా విభజిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు జిఒ ఆర్‌టి నెం.312ను జారీ చేసింది. ఏలూరు అర్బన్, రూరల్ మండలాలుగా విభజిస్తున్నట్లు ప్రభుత్వం గతంలోనే నిర్ణయం తీసుకుంది. అయితే జిల్లాల కొన్ని నగరాల్లో మండలాలను విభజిస్తున్నట్లు నోటిఫికేషన్ వచ్చినా దానిలో ఏలూరు లేకపోవడం చర్చనీయాంశమైంది. తాజాగా ఏలూరును అర్బన్, రూరల్ మండలాలుగా విభజిస్తూ నోటిఫికేషన్ విడుదల కావడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఉన్న తహశీల్దార్ ఆఫీసును మరోటి ఏర్పాటు చేస్తారని, పోస్టులు కూడా మంజూరు అవుతాయని తహశీల్దార్ సోమశేఖర్ ప్రజాశక్తికి తెలిపారు.

పొత్తుల గుబులు..!



టిడిపి, జనసేన పొత్తుపై ఆ పార్టీ శ్రేణుల్లో చర్చ

ఆశావహులైన టిడిపి, జనసేన నేతల్లో గుబులు

పొత్తులో జనసేనకు కేటాయించే స్థానాలపై ఎవరి లెక్కలు వారివే

ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలుపుతో టిడిపి శ్రేణుల్లో పెరిగిన జోష్

ఎంపీ స్థానాల కేటాయింపుపైనా లెక్కలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికలకు ఏడాది మాత్రమే గడువు ఉండటంతో రాజకీయపార్టీల పొత్తులపై క్షేత్రస్థాయిలో తీవ్ర చర్చలు సాగుతున్నాయి. ఏ నలుగురు కలిసినా టిడిపి, జనసేన పొత్తుపైనే మాట్లాడుతున్న పరిస్థితి నెలకొంది. ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలుపుతో టిడిపి శ్రేణుల్లో జోష్ పెరిగింది. దీంతో వచ్చే ఎన్నికల్లో గెలుపోటములు, పొత్తులపైనే గ్రామ, పట్టణాల్లో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలతోపాటు సామాన్య ప్రజానీకంలోనూ చర్చలు సాగుతున్నాయి. టిడిపి, జనసేన పొత్తు ఖాయమనే భావన ఆ పార్టీల శ్రేణుల్లో గట్టిగా కన్పిస్తోంది. అదే సమయంలో టిడిపి, జనసేన పొత్తు ఖాయమైతే జిల్లాలో ఏ స్థానాలను జనసేనకు కేటాయిస్తారనే దానిపై ఎవరి లెక్కలు వారు వేస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పరిశీలిస్తే 15 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలు ఉన్నాయి. జిల్లాలో కాపు సామాజిక తరగతి ఎక్కువగా ఉండటంతో జనసేనకు ఓటింగ్ శాతం కూడా ఉంది. 2019 ఎన్నికల్లో భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నరసాపురం వంటి స్థానాల్లో జనసేన ప్రధాన పార్టీలకు దీటుగా నిలబడింది. దీంతో తక్కువగా లెక్కించినా జిల్లాలో ఏడు స్థానాల వరకూ జనసేనకు కేటాయించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అదే సమయంలో స్థానాల కేటాయింపునకు సంబంధించిన పేర్లు సైతం బాహాటంగానే విన్పిస్తున్నాయి. మరోపక్క టిడిపి, జనసేన పొత్తు కుదిరితే అసెంబ్లీ టిక్కెట్ ఆశిస్తున్న టిడిపి జనసేన నాయకుల్లో తమ పరిస్థితి ఏమిటనే గుబులు సైతం నెలకొంది. పొత్తులో భాగంగా టిక్కెట్ రాకపోతే ఏమిటనే ప్రశ్న ఆశావహులను తొలిచేస్తోంది.

టిక్కెట్‌పై ఎవరి టెన్షన్ వారిదే..

టిడిపి, జనసేన పొత్తు ఖాయమైతే ఉంగుటూరు, తాడేపల్లిగూడెం, భీమవరం, నరసాపురం, పాలకొల్లు, తణుకు, ఏలూరు స్థానాలు జనసేనకు కేటాయించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జీలుగా ఉంగుటూరుకు మత్సపట్ల ధర్మరాజు, తాడేపల్లిగూడేనికి బొలిశెట్టి శ్రీనివాస్, ఏలూరుకు రెడ్డి అప్పలనాయుడు, నరసాపురానికి బొమ్మిడి నాయకర్ వంటి వారున్నారు. పాలకొల్లు, భీమవరంల్లో సమర్ధులైన నాయకులను బరిలో దింపాలనే యోచనలో సైతం జనసేన ఉన్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో ఆ నియోజకవర్గాల్లో టిడిపికి బలమైన నాయకులు, మాజీ ఎంఎల్ఎలు ఉన్నారు. ఉంగుటూరుకు ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, పాలకొల్లులో ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, ఏలూరులో బడేటి కుటుంబం, భీమవరంలో తోట సీతారామలక్ష్మి కుటుంబం, నరసాపురంలో బండారు మాధవనాయుడు, తాడేపల్లిగూడెంలో మాజీ జెడ్‌పి ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు వంటి నాయకులు ఉన్నారు.

పొత్తు కుదిరి ఈ స్థానాలు జనసేనకు కేటాయిస్తే వీరి భవితవ్యం ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ విధంగా జరిగితే ఎన్నికల్లో వీరంతా జనసేకు సహకరిస్తారా లేక అసంతృప్తితో ధిక్కార స్వరం వినిపిస్తారా అనే చర్చ జనాల్లో నడుస్తోంది. ఏదేమైనా పొత్తు ఖాయమైతే జనసేనకు జిల్లాలో ఏడు సీట్లు ఖాయమనే అభిప్రాయాన్ని ఆ పార్టీ శ్రేణులు బలంగా చెబుతున్నాయి. నరసాపురం ఎంపీ స్థానం జనసేనకు కేటాయిస్తారనే చర్చ సైతం నడుస్తోంది. పొత్తులో బిజెపి ఉంటే ఆ పార్టీకి ఏ స్థానాలు కేటాయించే అవకాశం ఉందనే మరో చర్చ సైతం సాగుతోంది. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న కొద్దీ పొత్తులపై క్షేత్రస్థాయిలో ఉత్కంఠ నెలకొంది.

రాజకీయ అజాతశత్రువు యర్రా ఇక లేరు

అనారోగ్యంతో భీమవరం ఆసుపత్రిలో మృతి

భౌతికకాయం స్వగ్రామం ఉప్పులూరు తరలింపు

ఉండి, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల్లో విషాదఛాయలు

కుటుంబానికి మంత్రి కారుమూరి ఫోన్లో పరామర్శ

నారాయణస్వామి మృతి పట్ల సిపిఎం సంతాపం

ప్రజాశక్తి - భీమవరం



నారాయణస్వామి (ఫైల్ ఫొటో)

రాజకీయ దురంధరుడు, అజాతశత్రువుగా పేరొందిన మాజీ మంత్రి, టిడిపి సీనియర్ నేత యర్రా నారాయణస్వామి (92) బుధవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. అనారోగ్యంతో స్థానిక ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. అంత్యక్రియల నిమిత్తం నారాయణస్వామి భౌతికకాయాన్ని స్వగ్రామమైన ఉండి మండలం ఉప్పులూరు తరలించారు. ఈ నేపథ్యంలో ఉండి, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఉన్నత జమిందారీ కుటుంబంలో జన్మించి సామాన్య ప్రజల అభ్యున్నతి కోసం పదవుల్లో ఉన్నా లేకపోయినా నిరంతరం శ్రమించిన నిరాడంబరునిగా యర్రా నారాయణస్వామి పేరొందారు. 1931 ఏప్రిల్ 30న ఆయన ఉండి మండలం ఉప్పులూరులో యర్రా సూర్యారావు, శేషాయమ్మ దంపతులకు తృతీయ సంతానంగా జన్మించారు. సూర్యారావు సోదరుడు యర్రా చంద్రరావు, ఆండాళ్లమ్మ దంపతులకు నారాయణస్వామి దత్తపుత్రునిగా వెళ్లారు. ప్రాథమిక విద్య ఉప్పులూరులో, మాధ్యమిక విద్య 'నవభారత గురుకులం' రాజమండ్రిలో పూర్తి చేశారు. 'రామకృష్ణ మఠం' తణుకులో ఉంటూ జిల్లా బోర్డు ఉన్నత పాఠశాలలో చదివారు. 1945 తర్వాత విశాఖపట్నంలో రామకృష్ణ మఠంలో ఉంటూ ఎవిఎన్ పాఠశాలలో ఎస్ఎస్ఎల్‌సి ఉత్తీర్ణులయ్యారు. 1947-49 మధ్య భీమవరం డబ్ల్యుజిబి కళాశాలలో ఇంటర్, కాకినాడ పిఆర్ కళాశాలలో డిగ్రీ పూర్తిచేశారు. తరువాత లక్నో రెసిడెన్షియల్ యూనివర్సిటీలో ఎంఎ, ఎల్ఎల్‌బి చదివారు. 1952 మే 15న తూర్పుగోదావరి జిల్లా అంతర్వేదికి చెందిన బెల్లంకొండ పెదరాజన్న కుమార్తె సీతామహాలక్ష్మిని వివాహం చేసుకున్నారు. 1956లో హైకోర్టు న్యాయవాది పోలిశెట్టి రామచంద్రరావు వద్ద అప్రెంటీస్‌గా కొద్దికాలం పని చేసి మానేశారు. 1958 వరకూ చిత్ర నిర్మాణ రంగంలో ప్రవేశించి సహనిర్మాతగా 'ఆడపెత్తనం' చిత్రాన్ని నిర్మించారు. మద్రాసు నుండి తిరిగొచ్చిన నారాయణస్వామి ఉప్పులూరు ప్రజల అభ్యర్థనపై 1960లో గ్రామ సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికై దశాబ్దకాలం పాటు 1970 వరకూ కొనసాగారు.

నారాయణస్వామి గ్రామ సర్పంచిగా పని చేసిన కాలంలో తండ్రి చంద్రరావు పేరున 'చంద్ర కళాసమితి' అనే సాంస్కృతిక భవనం, గ్రంథాలయ భవనం, పశువైద్యశాల, 1956లో చంద్రరావు, ఆండాళ్లమ్మ మిడిల్ హైస్కూల్, వల్లీ సుబ్రహ్మణ్యేశ్వర దేవాలయం సొంతం నిధులతో నిర్మించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. జిల్లాలోనే ప్రప్రథమంగా ఉప్పులూరులో రక్షిత మంచినీటి పథకాన్ని అమలు చేసిన ఘనత ఆయన సొంతం. 1963 నుండి 1969 వరకూ 'ది కోఆపరేటివ్ రూరల్ బ్యాంక్, ఉండి' శాఖకు ఛైర్మన్‌గా పి చేశారు. 'ది కృష్ణా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు డైరెక్టరుగానూ వ్యవహరించారు. 1960 నుండి 1976 వరకూ భీమవరంలో తన తండ్రిచే స్థాపించబడిన డబ్ల్యుజిబి కళాశాలకు వైస్ ప్రెసిడెంటుగా సేవలం దించారు. 1972లో కాంగ్రెస్ తరఫున స్థానిక సంస్థల కోటాలో ఎంఎల్‌సిగా నారాయణస్వామి ఎన్నికయ్యారు. యర్రాను ప్రత్యేకంగా గుర్తించిన ముఖ్యమంత్రి జలగం వెంగళరావు 1976 ఆగస్టులో మంత్రి పదవి కట్టబెట్టారు.

టిడిపి ఆవిర్భావం అనంతరం ఆ పార్టీలో చేరిన నారాయణస్వామి తాడేపల్లిగూడెంలో నుంచి ఎంఎల్ఎగా బరిలోకి దిగి గెలుపొందారు. జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా అత్యధిక మెజార్టీతో గెలుపొంది రికార్డు సృష్టించారు. 1987 నుంచి 1992 వరకూ ఆయన జెడ్‌పి ఛైర్మన్‌గా పని చేశారు. 1992 నుండి 2000 వరకూ టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యునిగాను పని చేశారు. 1994 జనవరిలో రాజ్యసభ సభ్యునిగా ఎన్నికయ్యారు. 1999లో తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గం నుండి తెలుగుదేశం అభ్యర్థిగా అఖండ విజయం సంపాదించారు.

ఉండి: మాజీమంత్రి, టిడిపి సీనియర్ నాయకులు యర్రా నారాయణస్వామి (92) మృతితో ఉప్పులూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. నారాయణస్వామి ఉప్పులూరు గ్రామ పంచాయతీ సర్పంచిగా రెండుసార్లు విజయం సాధించి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించారు. ఉండి విశాల సహకార పరపతి సంఘం ఛైర్మన్‌గా రెండుసార్లు బాధ్యతలు చేపట్టి పూర్తిస్థాయిలో రుణాలందించి రైతుల ఉన్నతికి పాటుపడ్డారు. 1978లో ఉండి నియోజకవర్గం నుంచి రెడ్డి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. యర్రా నారాయణస్వామికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు యర్రా నవీన్ ప్రస్తుతం వైసిపిలో ఉన్నారు. రెండో కుమారుడు యర్రా సూర్యచంద్రరావు రాజకీయాలకు దూరంగా ఉన్నారు. యర్రా నారాయణస్వామి మృతితో ఆయన స్వగ్రామం ఉప్పులూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. అంత్యక్రియల నిమిత్తం నారాయణస్వామి భౌతికకాయాన్ని ఉప్పులూరు తరలించారు.

తాడేపల్లిగూడెం: యర్రా నారాయణస్వామి మృతితో తాడేపల్లిగూడెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈయన తాడేపల్లిగూడెం శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాల గౌరవాధ్యక్షులుగాను, భీమవరం డిఎన్ఆర్ కళాశాల పాలకవర్గ సభ్యులగానూ ఉన్నారు. నారాయణ స్వామి మృతి పట్ల టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

పాలకొల్లు: మాజీ మంత్రి యర్రా నారాయణ స్వామి మతి పట్ల ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, ఎంఎల్ఎ అంగర రామ్మోహన్ సంతాపం వ్యక్తం చేశారు. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యునిగా ఆయన ఉమ్మడి జిల్లాకు చేసిన సేవలు చిరస్మరణీయమని వారు పేర్కొన్నారు.

నారాయణస్వామి మృతి పట్ల సిపిఎం సంతాపం

ఏలూరు: మాజీ మంత్రి యర్రా నారాయణస్వామి మృతిపట్ల సిపిఎం జిల్లా కమిటీ తీవ్ర సంతాపం తెలిపింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి బుధవారం ప్రకటన విడుదల చేశారు. నారాయణస్వామి జిల్లా రాజకీయాల్లో ముఖ్యపాత్ర పోషించారని పేర్కొన్నారు. జెడ్‌పి ఛైర్మన్‌గా, ఎంఎల్ఎగా, ఎంపీగా, మంత్రిగా పని చేసి ప్రజల గుర్తింపు, మన్ననలు పొందారని తెలిపారు. పోలవరం సాధన సమితి కన్వీనర్‌గా నిరంతరం కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన మృతి జిల్లాకు తీరని లోటు అని నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఇంటర్ రాత పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖరబాబు తెలిపారు. ఈ నెల 16న పరీక్షలు ప్రారంభమైన విషయాన్ని గుర్తు చేశారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో కలిపి 96 శాతం హాజరు నమోదైందని చెప్పారు. ద్వితీయ సంవత్సరంలో ఇద్దరు, ప్రథమ సంవత్సరంలో ఇద్దరు చొప్పున మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడి డీబార్ అయ్యారన్నారు.



ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ధర్నా

ప్రజాశక్తి - నిడమర్రు

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును తక్షణం పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణరావు ప్రభుత్వాన్ని కోరారు. భువనపల్లిలో భవన నిర్మాణ కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి బుధవారం ధర్నా నిర్వహించారు. గోక సూరిబాబు అధ్యక్షతన జరిగిన ధర్నాలో రమణరావు మాట్లాడుతూ వైసిపి అధికారంలోకొచ్చాక రాష్ట్రంలో 25 లక్షల మంది కుటుంబాలకు ఉపయోగపడే సంక్షేమ బోర్డును అమలులో లేకుండా ఇచ్చిన మెమో 1214ను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు నిధులను భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకే ఖర్చు చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ ఖాతరు చేయకుండా రూ.1240 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించిందన్నారు. తక్షణం ఆ నిధులను సంక్షేమ బోర్డుకు జమ చేసి కార్మికుల కుటుంబాలకు పెండింగ్ క్లెయిములు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, లేనిపక్షంలో రాబోయే కాలంలో రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కోన శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధనకు ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ ధర్నాలో కోసూరి ఏసు, వల్లపు రమణ, ఎం.సూరిబాబు, వి.వెంకట్, రమేష్, రాంబాబు పాల్గొన్నారు.

బిజెపి హయాంలో కార్మిక చట్టాల నిర్వీర్యం

చలో ఢిల్లీ ప్రచార జాతాలో నేతలు

ప్రజాశక్తి - ఏలూరు



ముసునూరులో ప్రచారజాతా..

కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి విమర్శించారు. సిఐటియు, రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో చలో ఢిల్లీ విజయవంతం కోరుతూ ఏలూరు నగరంలో రెండో రోజు బుధవారం ప్రచార జాతా నిర్వహించారు. ఈ జాతా తంగెళ్లమూడి బిల్డింగ్ సెంటర్ నుండి ప్రారంభమై చోడిదిబ్బ, రాణినగర్, ఇజ్రాయిల్‌పేట, కుమ్మరిరేవు, తాపీమేస్త్రి కాలనీ, కండ్రికగూడెం సెంటర్, టైటాన్స్ నగర్ గుండా సాగింది. జాతానుద్దేశించి రవి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్మికునికీ నెలకు రూ.26 వేలు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీలో వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి 200 రోజులు పని, రోజుకి రూ.600 వేతనం ఇవ్వాలన్నారు. కౌలు రైతుల సంక్షేమానికి సమగ్ర చట్టం తేవాలన్నారు. ఈ జాతాను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు నేతలు వి.సాయిబాబు, బి.జగన్నాధరావు, బి.సోమయ్య, గోపీ, జి.కోటేశ్వరరావు, అప్పన్న, వరద వెంకట్రావు, రవీంద్ర పాల్గొన్నారు.

చింతలపూడి: చలో ఢిల్లీ ప్రచార యాత్ర చింతలపూడి మీదుగా సాగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌విఎస్.నారాయణ, జిల్లా కార్యదర్శి ఎం.నాగమణి, వ్యవసాయ కార్మిక సంఘం నేత టి.అన్నవరం, రైతుసంఘం నాయకులు ఎ.మురళీ మాట్లాడారు. కార్యక్రమంలో డి.సత్తిబాబు, టి.ముత్యాలమ్మ, ఎన్.సరోజిని, మాణిక్యం, సరళ పాల్గొన్నారు.

చాట్రాయి: చలో ఢిల్లీ ప్రచార యాత్ర చాట్రాయి మీదుగా సాగింది. ఈ సందర్భంగా జాతా నేతలు ఆర్‌విఎస్.నారాయణ, ఎం.నాగమణి, టి.ముత్యాలమ్మ, ఎ.మురళీ మాట్లాడగా స్థానిక నేతలు కె.భాస్కరరావు, కొమ్ము ఆనందం, మేడేపల్లి హోలీ మేరీ పాల్గొన్నారు.

టి.నరసాపురం: చలో ఢిల్లీ విజయవంతం చేయాలని చేపట్టిన ప్రచార జాతా మండలంలోని మక్కినవారిగూడెం, అల్లూరు సీతారామరాజు నగర్, టి.నర్సాపురం మీదుగా సాగింది. ఈ సందర్భంగా నేతలు మొడియం నాగమణి, తుమ్మల సత్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో తామా ముత్యాలమ్మ, ఎ.మురళీ, మడకం సుధారాణి, ఎం.కుమారి, జయరాజు, గురుగుంట్ల సావిత్రి, అల్లూరి సీతారామరాజు నగర్ వాసులు పాల్గొన్నారు.

ముసునూరు: చలో ఢిల్లీని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక మండపం సెంటర్ వద్ద ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజుతోపాటు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పిల్లి మురళీ, వివిధ సంఘాల నేతలు పి.రాజకుమారి, పోట్రు శ్రీను, కంచర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'దోసపాడు' దళితుల పట్ల నిర్లక్ష్యం తగదు

కొనసాగిన రిలేనిరాహార దీక్షలు - సిపిఎం నేతల మద్దతు

ప్రజాశక్తి - దెందులూరు



దీక్షకు మద్దతు తెలుపుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.కిషోర్

దోసపాడులో పేదలు గత పది నెలల నుంచి అసైన్డ్, సీలింగ్, గయాళ భూములు పంచాలని పోరాడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.కిషోర్ విమర్శించారు. బుధవారం దోసపాడు గ్రామ సచివాలయం వద్ద సాగుతున్న రిలే నిరాహార దీక్షలకు సిపిఎం తరఫున ఆయన సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం వచ్చాక పేదల భూములను కార్పొరేట్ కంపెనీలకు, బడా భూస్వాములకు అప్పనంగా కట్టబెడుతున్నారని మండిపడ్డారు. దళితుల అభ్యున్నతికి పాటుపడతామని చెబుతూనే దళితుల భూములను దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని విమర్శించారు. భూస్వాములపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. 25 ఏళ్ల నుండి పేదల భూములను ఆక్రమించుకుని అనుభవిస్తున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రెవెన్యూ శాఖ అధికారులు రికార్డులు తారుమారు చేస్తూ పేదలను వారి భూములను వారికి దక్కకుండా చేస్తున్నారని ఆరోపించారు. మండల రెవెన్యూ అధికారులు అవినీతికి పాల్పడుతుంటే జిల్లా అధికారులు మొద్దు నిద్రపోతున్నారని విమర్శించారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు కింద నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ దోసపాడు, పోతునూరు, కొవ్వలి, దెందులూరు తదితర గ్రామాల్లో వందల ఎకరాలు పేదలకు చెందిన భూములు అన్యాకాంతమయ్యాయని, దీనికి రెవెన్యూ శాఖ అధికారులే కారణమని అన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్‌డిఒ జోక్యం చేసుకుని పేదలకు చెందిన భూములు వారికి అప్పగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భూపోరాట నాయకులు ఆనందరావు, సునీల్, వెంకటరమణ, మణి, లక్ష్మి, బేబీ, లలిత, వినోద్, నాగేంద్ర పాల్గొన్నారు.



హాజరైన సభ్యులు, మాట్లాడుతున్న మేయర్ నూర్జహాన్ పెదబాబు

రూ.237 కోట్లతో ఏలూరు బడ్జెట్ ఆమోదం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

రూ.237 కోట్లతో రూపొందించిన 2023-24 ఏలూరు నగరపాలక సంస్థ బడ్జెట్‌ను సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. నగరపాలక సంస్థ బడ్జెట్ సమావేశం బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ పాలకవర్గం ఏర్పడిన తర్వాత ఇది రెండో బడ్జెట్ సమావేశమన్నారు. సిఎం జగన్ సారథ్యంలో డిప్యూటీ మాజీ సిఎం, ఎంఎల్ఎ ఆళ్ల నాని సహకారంతో ఏలూరు నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. 15వ ఆర్థిక సంఘం, అర్బన్ హెల్త్, స్వచ్ఛభారత్, అమృత్, ఎస్‌సి,ఎస్‌టి సబ్‌ప్లాన్, వివిధ రకాలుగా సమకూరే నిధులను అంచనాలు వేస్తూ, ప్రజారోగ్యం, సాధారణ పరిపాలన, లైటింగ్, విద్య, తాగునీరు, డ్రెయినేజీలు, పార్కుల సుందరీకరణ తదితర అభివృద్ధి పనులకు పెద్దమొత్తంలో నిధులు కేటాయిస్తూ బడ్జెట్ రూపకల్పన చేశామన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి ప్రారంభ నిల్వగా రూ.56 కోట్ల 90 లక్షల 44 వేలతో రూ.237 కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టామన్నారు. రూ.227 కోట్లు ఖర్చులుగాను రూ.10.55 కోట్లు ముగింపుగా అంచనాలు రూపొందించామన్నారు. ఈ బడ్జెట్‌ను సభ్యులందరూ ఆమోదించారన్నారు. ఈ సమావేశంలో ఎంఎల్‌సి షేక్ సాబ్జీ, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, అడిషనల్ కమిషనర్ బాపిరాజు, డిప్యూటీ కమిషనర్ కర్రి వెంకటేశ్వరరావు అధికారులు పాల్గొన్నారు.

బోయ వాల్మీకులను ఎస్‌టిల్లో చేర్చొద్దని ధర్నా

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దంటూ ఏజెన్సీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఐటిడిఎ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు మాట్లాడుతూ రాష్ట్ర అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, తక్షణమే ఆ తీర్మానాన్ని రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సవలం రాంబాబు, దాడి రాముడు, మిడియం రవి దొర పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న నాయకులు

గిరిజన గ్రామాల్లో జెసి పర్యటన

ప్రజాశక్తి - వేలేరుపాడు/బుట్టాయిగూడెం

జిల్లా జాయింట్ కలెక్టర్, ఐటిడిఎ ఇంఛార్జి ప్రాజెక్ట్ అధికారి పి.అరుణ్‌బాబు బుధవారం గిరిజన మారుమూల ప్రాంతాల్లో అధికారులతో కలిసి పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వేలేరుపాడు మండలం మోదుల గ్రామంలోని ప్రజలను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. నిరుద్యోగ యువతకు వెదురు వస్తువుల తయారీపై శిక్షణ అందిస్తే మంచి ఉపాధిమార్గం కాగలదని జెసి దృష్టికి తీసుకువచ్చారు. మోదుల గ్రామంలోని గిరిజన ప్రజల ఇళ్లకు, వీధి దీపాల నిమిత్తం ఏర్పాటుచేసిన సోలార్ విద్యుత్ వ్యవస్థ మరమ్మతులకు గురైందని, వాటిని మరమ్మతులు చేయించాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరారు. అనంతరం రేగులపాడులోని గిరిజన పాఠశాలను సందర్శించి విద్యాబోధనను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం ద్వారా మెనూ అనుసరించే మంచి పౌష్టికాహారం అందించాలని ఉపాధ్యాయులను జెసి ఆదేశించారు. అనంతరం బుట్టాయగూడెం మండలం లంకాలపల్లిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యా బోధన స్థాయిని పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. జెసి వెంట గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సివిఎస్.నాయుడు, వేలేరుపాడు తహశీల్దార్ చల్లన్నదొర, బుట్టాయగూడెం ఆర్ఐ పద్మావతి పాల్గొన్నారు.

31న రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

అభివృద్ధి చెందిన గిరిజనేతరులైన బోయ వాల్మీకులను గిరిజన జాబితాలో చేర్చొద్దంటూ ఈ నెల 31న శుక్రవారం జరిగే రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలని గిరిజన, ప్రజాసంఘాలు పిలుపునిచ్చాయి. బుధవారం స్థానిక బస్టాండ్ వద్ద బంద్ పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. గిరిజన సంఘం మండల అధ్యక్షుడు కారం భాస్కర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, జెఎసి వైస్ ఛైర్మన్ కె.దుర్గారావు మాట్లాడారు. వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చే ముందు గిరిజన సలహా మండలి (టిఎసి)లో చర్చించకుండా ముఖ్యమంత్రి ఏకపక్షంగా ఎలా తీర్మానం చేశారని ప్రశ్నించారు. ఈ నెల 31న బంద్ కు మన్యం ప్రజలు అందరూ సహకరించాలని కోరారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు, బ్యాంకులు, ప్రయివేట్ విద్యా సంస్థలకు బంద్ నోటీసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ కార్యదర్శి తెల్లం లక్ష్మణ్, న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి తగరం బాబురావు, కొండరెడ్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పట్ల రమేష్‌రెడ్డి, సోదెం ముక్కయ్య, తెల్లం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేలేరుపాడు: స్థానిక హైస్కూల్ గ్రౌండ్‌లో ఆదివాసీ జెఎసి సమావేశం కారం. దారయ్య అధ్యక్షతన జరిగింది. 31న బంద్ జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ధర్మల, రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు మడివి దుర్గారావు, తాట్కూర్ గొమ్ము సర్పంచి కట్టి ఉదయ్, కట్కూర్ సర్పంచి కొవ్వాసి లక్ష్మణ్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ అధ్యక్ష కార్యదర్శులు సోడే సీతారామయ్య, ఊకే. ముత్యాలరావు, ఆదివాసీ మహాసభ నాయకులు మొట్టుం రాంబాబు, వ్యకాస నేతలు కారం, వెంకట్రావు,మాధవ రెడ్డి పాల్గొన్నారు.


టి.నరసాపురం: ఈ నెల 31న ఏజెన్సీ బంద్‌ను జయప్రదం చేయాలని వాల్‌పోస్టర్‌ను నేతలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఎం నేత గుడెల్లి వెంకట్రావు, గిరిజన సంఘం మండల కార్యదర్శి బొరగం భూచంద్రరావు మాట్లాడగా ఎర్ర శ్రీను, వెంకట్రావు, రాజు పాల్గొన్నారు.

ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - చింతలపూడి

రాష్ట్ర అభివృద్ధికి టిడిపి చేసిన కృషి ఎనలేనిదని, తెలుగు రాష్ట్రాల్లో ఏ రాజకీయ పార్టీకి లేని అభిమానులు, కార్యకర్తలు, నాయకులు తమ పార్టీకి ఉన్నారని టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొండ్రు దేవ అన్నారు. పట్టణంలోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద పార్టీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత పార్టీ జెండాను ఎగురవేసి, ఎన్‌టి.రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చింతలపూడి నగర పంచాయతీ అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరరావు, నగర పంచాయతీ ప్రధాన కార్యదర్శి బోడా నాగభూషణం మాట్లాడుతూ పేదవాడికి కూడు, గూడు, గుడ్డ అందించాలనే లక్ష్యంతో ఏర్పడి, బడుగు, బలహీన వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చిన పార్టీ తెలుగుదేశం అని అన్నారు. కొండ్రు దేవా, చింతలపూడి నియోజకవర్గ నాయకులు గుడిపూడి రవి, బిటిడిపి చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడా అనీష్‌కుమార్ మాట్లాడుతూ తెలుగుజాతి ఆత్మగౌరవ నినాదంతో తెలుగుదేశం పార్టీని స్థాపించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు ప్రసాద్, పాములపాటి నర్సారెడ్డి, సీనియర్ నాయకులు తిరుమిల్లి రామారావు, తాటి అప్పారావు, టౌన్ ఉపాధ్యక్షులు పొదిలి రాయప్ప, టౌన్ రైతు అధ్యక్షులు రావెళ్ల హనుమంతరావు, గంటా నాగభూషణం, శాంతారెడ్డి, మండల ఉపాధ్యక్షులు అప్పిరెడ్డి నాగు, ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు నందిపాము నాగేశ్వరరావు, కార్యదర్శి గుడిదేసి ఏసు, టౌన్ తెలుగు యువత అధ్యక్షులు నత్తా రవి, కార్యదర్శి అడ్డాల రవి, టౌన్ మాజీ అధ్యక్షులు బందెల ఆశీర్వాదం, మండల మాజీ ప్రధాన కార్యదర్శి ధార వీరేంద్ర, నాయకులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.


చాట్రాయి : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పరిపాలనాపరంగా విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన పార్టీ టిడిపి అని జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చనుబండ సెంటర్లో పార్టీ జెండా ఎగురవేసి, ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేశారు. అదేవిధంగా సూరంపాలెంలో జెండా ఆవిష్కరించి, ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. చాట్రాయిలో మాజీ సర్పంచి కోటా జోషి ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జనార్ధనవరంలో తెలుగు మహిళా అధ్యక్షురాలు మాదాసు చంద్రకళ ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో మోరంపూడి శ్రీనివాసరావు, ఏలూరు జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవరెడ్డి, మాదాసు చిన్నపుల్లయ్య, పలగాని దుర్గారావు, కంచర్ల హనుమంతరావు, బొట్టు రామచంద్రరావు, నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


ముసునూరులో..

పోలవరం : బడుగు బలహీన వర్గాల కోసం ఆవిర్భవించిన పార్టీ తెలుగుదేశం అని ఆ పార్టీ మండల అధ్యక్షులు బొడ్డు కృష్ణ అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం పోలవరం, ఎల్ఎన్‌డి పేట గ్రామాల్లో నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు గుబ్బా రాంబాబు, టౌన్ ప్రెసిడెంట్ పోతుల శ్రీనివాసరావు, ఎస్‌సి సెల్ ప్రెసిడెంట్ పిల్లి నాగరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ మంగిన కొండ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : ఇడిపి ఆవిర్భావ దినోత్సవం పార్టీ నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. గురవాయిగూడెంలో మండల అధికార ప్రతినిధి వందనపు రమణ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. మండల ఉపాధ్యక్షురాలు అరుగొల్లు గంగ, రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామచంద్రశేషు, మాజీ అధ్యక్షులు ముళ్ళపూడి శ్రీను, తెలుగు రైతు అధ్యక్షులు శ్రీను, బొబ్బర రాజ్ పాల్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని అశ్వరావుపేట రోడ్‌లో ఎన్‌టి రామారావు విగ్రహానికి టిడిపి పట్టణ అధ్యక్షులు రావూరి కృష్ణ అధ్యక్షతన పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ముదినేపల్లి : స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని అల్లూరులో దావు నాగరాజు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమాలో టిడిపి మండల అధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రిచౌదరి, ప్రధాన కార్యదర్శి బొంగు రవికుమార్, బొర్రా చలమయ్య, కె.శేషుబాబు, పి.పాండురంగారావు, సిహెచ్.జగన్‌మోహన్‌రావు, వి.నరసింహారావు, కె.విఠల్ పాల్గొన్నారు.


చింతలపూడిలో..

ఆగిరిపల్లి : టిడిపి ఆవిర్భావ వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఆగిరిపల్లిలో పార్టీ మండల అధ్యక్షులు మల్లవల్లి కోటేశ్వరరావు, తోటపల్లిలో మాజీ సర్పంచి ఆరేపల్లి శ్రీనివాసరావు, చొప్పరమెట్లలో సర్పంచి కూరాకుల ఊర్మిళ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

ముసునూరు : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి టిడిపి ఎల్లప్పుడూ పాటుపడుతుందని తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ కెక్రటరీ గద్దే రఘుబాబు అన్నారు. మండలంలో పార్టీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు దేవినేని ఢలరామ్, కందుల పిచ్చియ్య, గద్ధల మోహన్‌రావు, కొండేటి బాబి, విజయలక్ష్మి, పి.సత్యనారాయణ, పాకనాటి సీతారామ్, నక్కా యోహాన్, రాపర్ల బాలకృష్ణ, కొల్లి గంగారామ్, మేదరమెట్ల సురేంద్ర, జొనుబోయిన రాంబాబు, సుగసాని వెంకటనాగేంద్రబాబు, మండవ బుజ్జి, సూర్యదేవర నాగమంజుల, శ్రీనివాసరావు, మండలపు ధర్మరాజు, సొంగా ఇస్సాక్, కాటేపల్లి సత్యనారాయణ, రాధిక సత్యనారాయణ, సిహెచ్.దేవేంద్ర, కె.మురళీ, మల్లిబాబు పాల్గొన్నారు.


ఏలూరులో..

నూజివీడు : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసమే టిడిపి ఆవిర్భవించిందని పట్టణ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నూజివీడు పట్టణ అధ్యక్షులు మలిశెట్టి జగదీష్, ప్రధాన కార్యదర్శి పల్లి నాగరాజు, రాష్ట్ర బిసి సెల్ కార్యనిర్వాణ కార్యదర్శి తలపండి రాజశేఖర్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు చలసాని గోపాలకృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలిదిండి : టిడిపి ఆవిర్భావం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, ఎఎంసి మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాసచౌదరి, సర్పంచులు గూడవల్లి శ్రీనివాసరావు, పరసా వెంకట స్వామి, టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏలూరు టౌన్: నీతివంతమైన రాజకీయాలతో దేశంలోనే ప్రాంతీయ పార్టీలకు సముచిత గౌరవాన్ని, భాగస్వామ్యాన్ని కల్పించిన ఏకైక పార్టీ టిడిపి అని ఆ పార్టీ జిల్లా కార్యాలయ కార్యదర్శి పాలి ప్రసాద్ అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ కార్యాలయంలో పాలి ప్రసాద్ తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాలి ప్రసాద్ మాట్లాడారు. అనంతరం ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో ఉన్న నందమూరి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యకర్తలకు స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఉప్పాల జగదీష్‌బాబు, సిహెచ్.అశోక్ గౌడ్, పెద్దిబోయిన శివప్రసాద్, చోడే వెంకటరత్నం, లింగిశెట్టి శశికుమార్ పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : మండలంలో టిడిపి ఆవిర్భావ వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పి.అంకంపాలెంలో టిడిపి ఎంపిటిసి నాలి శ్రీను అధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


కైకలూరు : పట్టణంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తాలుకా సెంటర్, కోరుకొల్లు సెంటర్లలోని ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

టి.నరసాపురం : టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మక్కినవారిగూడెంలో నాయకులు పార్టీ జెండా ఎగురవేసి, ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఆచంట అనిల్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శులు జయవరపు శ్రీరామ్మూర్తి, శీలం వెంకటేశ్వరరావు, బిసి సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొండపల్లి రవి, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు నల్లూరి చలపతిరావు, సర్పంచి గోపాలరావు పాల్గొన్నారు.

150 యూనిట్లు ఉచితంగా ఇవ్వాలి

ప్రజాశక్తి - కామవరపుకోట


బార్బర్ షాపులకు 150 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేయాలని చింతలపూడి నియోజకవర్గ నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు చిప్పాడ నరసింహారావు అధికారులను కోరారు. బుధవారం సంఘం కామవరపుకోట అధ్యక్షులు సిహెచ్.నాగరాజు అధ్యక్షతన స్థానిక విద్యుత్ శాఖ ఎడిఇ కె.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా చింతలపూడి నియోజకవర్గ నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు చిప్పాడ నరసింహారావు మాట్లాడుతూ నాయీబ్రాహ్మణ సేవా సంఘం ద్వారా రూ.పది వేలు, బార్బర్ షాపులకు 150 యూనిట్ల ఉచిత విద్యుత్, కులం పేరుతో నాయీబ్రాహ్మణులను దూషిస్తే కఠిన చర్యల జీవో నెంబర్ 50 అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం పట్టణ అధ్యక్షులు మల్లవరపు నాగపోసి, గన్నవరపు వెంకటాచలం, కాలకంటి దుర్గారావు, గన్నవరపు మురళీ, మల్లవరపు వీరభద్రరావు, ఏడుకొండలస్వామి, కుమార్, బాబీ, సీతారామయ్య పాల్గొన్నారు.


జనంకోసం జనసేనలో నాయకులు..

రాష్ట్రాభివృద్ధిలో వైసిపి విఫలం : జనసేన

ప్రజాశక్తి - పోలవరం


రాష్ట్ర అభివృద్ధిలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రచార ఆర్భాటమే తప్ప అభివృద్ధి లేదని పోలవరం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి చిర్రి బాలరాజు అన్నారు. మండలంలోని గుంజవరంలో జనంకోసం జనసేన కార్యక్రమాన్ని పార్టీ మండల అధ్యక్షులు గుణపర్తి చిన్న ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలరాజు గడపగడపకూ తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన సిద్ధాంతాలను ప్రతీగడపకూ తీసుకెళ్తామన్నారు. బోయ, వాల్మీకులను ఎస్‌టిల్లో చేర్చేందుకు అసెంబ్లీలో చేసిన తీర్మానం తక్షణం విరమించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షులు కురసం రమేష్, కార్యదర్శి కనుమర్లపూడి నాగేశ్వరరావు, సీతయ్య, తురం రమేష్, కరిబండి రాజు, మామిడిపల్లి ప్రసాద్, మామిడిపల్లి స్వాతి, నాగు, కురంశెట్టి రవికుమార్, జన సైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.


కుట్టుమిషన్లు అందిస్తున్న ఎంఎల్‌ఎ

హోప్ మినిస్ట్రీస్ ఆధ్వర్యాన కుట్టు మిషన్ల పంపిణీ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం


స్థానిక హోప్ మినిస్ట్రీస్ సంస్థ ఆధ్వర్యంలో మహిళల ఉపాధికి వంద కుట్టు మిషన్‌లు ఉచితంగా అందించడం అభినందనీయమని చింతలపూడి శాసనసభ్యులు ఉన్నమట్ల ఎలిజా అన్నారు. బుధవారం స్థానిక చిట్టూరి గణేశ్వరరావు టౌన్ హాలులో మెగా కుట్టు మిషన్ల పంపిణీని ఎంఎల్‌ఎ నిర్వహించారు. ఈ సందర్భంగా హోప్ మినిస్ట్రీస్ సంస్థ డైరెక్టర్ జాషువాను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం ఎంఎల్‌ఎ మాట్లాడుతూ కుట్టుమిషన్లు తీసుకున్న మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మినిస్ట్రీస్ డైరెక్టర్ జాషువా మాట్లాడుతూ 2015 నుంచి ఇప్పటివరకూ సంస్థ ద్వారా ఏడు వేల కుట్టుమిషన్లను పేద మహిళలకు పంపిణీ చేశామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో మూడు కుట్టు మిషన్ల శిక్షణా కేంద్రాలు నడుస్తున్నాయని తెలిపారు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. అనంతరం ఎంఎల్‌ఎను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యులు పి.బాబ్జీ, వైసిపి సీనియర్ నాయకులు, మాజీ సర్పంచి మండవల్లి విజయ సారథి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ రీజనల్ ఛైర్‌పర్సన్ వందనపు సాయిబాలపద్మ, మున్సిపల్ వైస్‌ఛైర్మన్‌లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీ రత్నం, వైసిపి మండల అధ్యక్షులు వామిశెట్టి హరిబాబు, పట్టణ అధ్యక్షులు చంద్రరావు పాల్గొన్నారు.


బోరు ఏర్పాటును పనులను ప్రారంభిస్తున్న నరసింహారావు

వైఎస్ఆర్ జలకళను వినియోగించుకోండి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

వైఎస్ఆర్ జలకళను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వైసిపి మండల అధ్యక్షులు పల్లగాని నరసింహారావు అన్నారు. కలటూరులో జలకళ కార్యక్రమాన్ని ఆయన ప్రారభించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు పిన్నిబోయిన వీరబాబు, కలటూరు సర్పంచి రాఘవరపు సురేష్‌కుమార్, వైసిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.


మండవల్లిలో మహిళలకు ఆసరా నమూనా చెక్కును అందిస్తున్న ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు

మహిళల ఆర్థికాభివృద్ధికి వైసిపి కృషి

ప్రజాశక్తి - మండవల్లి

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే సిఎం జగన్ ముఖ్యఉద్దేశమని కైకలూరు ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో జరిగిన మూడో విడత ఆసరా పంపిణీలో ఎంఎల్‌ఎ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళల సాధికారతకు జగనన్న ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందన్నారు. పథకాల లబ్ధి మహిళలకు అందిస్తూ మహిళా పక్షపాతిగా వైసిపి ఉందన్నారు. జగనన్నకు మహిళలు తోడుగా ఉండాలని ఆయన కోరారు. తొలుత మహిళలు ఎంఎల్‌ఎకు ఘనస్వాగతం పలికారు. అనంతరం మండలంలో మూడో విడతగా మంజూరైన రూ.తొమ్మిది కోట్ల 71 లక్షల 88 వేల 662 నమూనా చెక్కును డ్వాక్రా మహిళలకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, వైస్ ఎంపిపి అగస్తి ఆది విష్ణు, జెడ్‌పిటిసి సభ్యులు ముంగర విజయనిర్మల, పార్టీ మండల అధ్యక్షులు గుమ్మడి వెంకటేశ్వరరావు, బిసి నాయకులు చేబోయిన వీర్రాజు, మహిళా విభాగం అధ్యక్షురాలు వెంకటరమణ, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు బేతపూడి ఏసేబురాజు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: స్థానిక శ్రీవెంకటేశ్వరస్వామి వారి దేవస్థానం హైస్కూల్ ప్రాంగణంలో వైఎస్ఆర్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీని ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 1524 డ్వాక్రా గ్రూపులకు రూ.16 కోట్ల తొమ్మిది లక్షల 28 వేల 734 జమచేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బొండాడ మోహిని, వెంకన్నబాబు, జెడ్‌పిటిసి సభ్యులు చిగురిపల్లి శామ్యూల్, వైసిపి నాయకులు చెలికాని రాజబాబు, వాసుబాబు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు


ప్రమాదానికి గురైన లారీ, బస్సు

బైనేరు వంతెనపై రోడ్డు ప్రమాదం

లారీ, బస్సు ఢీ - నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణ శివారు బైనేరు కాలువ వంతెనపై లారి-బస్సు ఎదురెదురుగా ఢీ కొన్నఘటనలో నలుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజమండ్రి నుండి జంగారెడ్డిగూడెం వస్తున్న ఆర్‌టిసి బస్సు, హైదరాబాద్ నుండి రాజమండ్రి వైపు వెళ్తున్న లారీ బైనేరు కాలువ వంతెనపై ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న నలుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. వంతెనపై జరిగిన ప్రమాదం నేపథ్యంలో ఇరువైపులా వాహనాలు నిలిచి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. స్థానిక ఎస్ఐ సాగర్‌బాబు పోలీస్ సిబ్బందితో సంఘటన ప్రాంతానికి చేరి ట్రాఫిక్ సమస్య లేకుండా క్రమబద్ధీకరించారు. బైనేరు వంతెనపై జరిగిన ఈ ప్రమాదంలో ప్రాణాప్రాయం జరగకపోవడంపై ప్రయాణికులు, స్థానిక ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. ఇటీవల మండలంలోని వేగవరం జల్లేరు కాలువలో ఆర్‌టిసి బస్సు బోల్తా పడి ప్రయాణికులు దుర్మరణం చెందిన ఘటన మరువకముందే బైనేరు వంతెనపై మరో ప్రమాద ఘటన పరిసర ప్రాంతాల ప్రజలను కలవరపాటుకు గురిచేసింది. వాహనాలు అతివేగంగా నడపకుండా వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - ముసునూరు

భార్యాభర్తల గొడవల నేపథ్యంలో భార్య ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని బలివే గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కడవకొల్లు మారేష్‌కు, చుక్కమ్మ(30)కు నాలుగేళ్ల క్రితం వివాహం అయింది. వీరికి ఇద్దరు కుమార్తెలున్నారు. రెండురోజులుగా భార్యభర్తలిద్దరూ గొడవపడుతున్నారని స్థానికులు తెలిపారు. ఈ తరుణంలో చుక్కమ్మ ఇంటి దూలానికి చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.కుటుంబరావు తెలిపారు.

నాటుసారా విక్రేత అరెస్టు

ప్రజాశక్తి - టి నరసాపురం

నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సతీష్‌కుమార్ బుధవారం తెలిపారు. పోలవరం మండలం కొత్తపట్టిసీమ గ్రామానికి చెందిన వ్యక్తి మండలంలోని మక్కినవారిగూడెం సమీపంలో అనుమానాస్పదంగా తిరగడంతో పోలీసులు గుర్తించి తనిఖీ చేశారు. ఈ తనిఖీలో అతని వద్ద పది లీటర్ల నాటుసారా గుర్తించి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆలయ రికార్డులు దగ్ధం కేసులో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని గొల్లపల్లి శ్రీరఘునాథస్వామి ఆలయ రికార్డులు దగ్ధం కేసులో ముగ్గురు నిందితులను రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నూజివీడు డిఎస్‌పి ఎ.అశోక్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కార్యాలయంలోని రికార్డులను గుర్తుతెలియని వ్యక్తులు దగ్ధం చేశారని స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆలయ ఇఒ తల్లాప్రగడ విశ్వేశ్వరరావు ఈనెల 23వ తేదీన ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా ఎస్‌పి రాహుల్ దేవ్‌శర్మ ఆదేశాల ప్రకారం డిఎస్‌పి పర్యవేక్షణలో, రూరల్ సిఐ రాజులపాటి అంకబాబు ఆధ్వర్యంలో రూరల్‌ఎస్ఐ టి.రామకృష్ణ తన సిబ్బందితో కలిసి గొల్లపల్లి శివారున గ్రామానికి చెందిన నిందితులు యలమర్తి ప్రభాకర్, అతని అనుచరులు మిరియాల నవీన్, దోనేటి చిన్నఏసును అరెస్ట్ చేశామన్నారు. అయితే ప్రభాకర్‌పై, నవీన్‌పై గతంలో ఒక్కొక్కరిపై మూడు కేసులు పోలీస్ స్టేషన్లో నమోదైన నేపథ్యంలో ఇరువురిపైన రౌడీషీట్లు ఓపెన్ చేయనున్నట్లు డిఎస్‌పి తెలిపారు.

కుప్పకూలిన దేవరం వంతెన

చేపల లోడు వ్యాన్ వెళ్తుండగా ఘటన - తప్పిన ప్రమాదం - రాకపోకలకు జనం అవస్థలు

ప్రజాశక్తి - ముదినేపల్లి


కూలిన వంతెన

ముదినేపల్లి శివారు అన్నవరం-దేవరం గ్రామల మధ్య అన్నవరం డ్రెయిన్‌పై నిర్మించిన వంతెన బుధవారం కుప్పకూలింది. ఉదయం 11 గంటల సమయంలో చేపల లోడుతో వంతెన పైనుంచి వ్యాన్ వెళ్తుతుండగా ఈఘటన జరిగింది. అయితే ఎలాంటి ప్రాణనష్టమూ జరగలేదు. జెసిబితో వ్యాన్‌ను బయటకు తీశారు. దీంతో ఈ మార్గంలో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. సుమారు 40 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ వంతెన శిథిలావస్థకు చేరింది. కాకరవాడ శివారు దేవరం గ్రామస్తులు నిత్యం ఈ వంతెనపై నుంచే ముదినేపల్లి ఇతర గ్రామాలకు రాకపోకలు సాగిస్తుంటారు. అంతేకాక దేవరం నుంచి నిత్యం విద్యార్థులు ముదినేపల్లిలోని వివిధ పాఠశాలలకు పదుల సంఖ్యలో వంతెనపై నుంచే విద్యార్థులు సైకిళ్లపై వెళ్తుంటారు. దేవరం ఆయకట్టులో ఆక్వాసాగు విస్తరించడంతో నిత్యం ఆక్వారైతులు చేపల మేతలు రవాణా, చేపలు, రొయ్యల ఎగుమతులు, చేప, రొయ్య పిల్లల దిగుమతులు ఈ వంతెన పైనుంచి సాగుతుంటాయి. ఎంతో ప్రాధ్యాన్యత కలిగిన వంతెన కుప్పకూలడంతో ముదినేపల్లి, అన్నవరం, గ్రామాల నుంచి దేవరం వెళ్లే అవకాశం లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఉదయం తొమ్మిది గంటల సమయంలో ఈ వంతెన పైనుంచి ముదినేపల్లిలోని వివిధ విద్యాసంస్థలకు వెళ్లిన విద్యార్థులు సాయంత్రం తిరిగి ఇళ్లకు వెళ్లేందుకు వంతెన వద్దకు రాగానే వంతెన కూలిపోవడం గమనించి ఏమిచేయాలో తెలియక అయోమయానికి గురయారు. దీంతో చేసేదిలేక సైకిళ్లతో పాటు డ్రెయిన్‌లో దిగి అవతల గట్టుకు చేరుకుని ఇళ్లకు బయలుదేరి వెళ్లారు. ద్విచక్ర వాహనదారులైతే ముదినేపల్లి నుంచి శ్రీహరిపురం, కాకరవాడ మీదుగా చుట్టు తిరిగి దేవరం గ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారులు స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాలని కోరారు. పరీక్షలు దగ్గరకు వచ్చాయని వంతెన కూలిపోవడం వల్ల తాము అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందంటున్నారు. దేవరం నుంచి అన్నవరం మీదుగా ముదినేపలికి సుమారు నాలుగు కిలోమీటర్లు దూరం కాగా, దేవరం నుంచి కాకరవాడ, శ్రీహరిపురం మీదుగా ముదినేపల్లికి చేరుకోవడానికి ఎనిమిది కిలో మీటర్ల దూరం ఉంటుందని గ్రామస్తులు అంటున్నారు. దీంతో అనేక ఇబ్బందులు పడాల్సివస్తోందని చెబుతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, అప్పటి వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని విద్యార్థులు, దేవరం గ్రామస్తులు, అధికారులను కోరుతున్నారు.

జాతీయస్థాయి టాలెంట్ టెస్ట్‌లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - చింతలపూడి

గత నెలలో జరిగిన ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ పరీక్షలో శ్రీ చైతన్య టెక్నో పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సత్యనారాయణ తెలిపారు. పాఠశాలలో మొత్తం 252 మంది విద్యార్థులు ఈ పరీక్ష రాశారన్నారు. అందరికీ మెరిట్ సర్టిఫికెట్లు లభించాయన్నారు. గణిత విభాగంలో ఎనిమిదో తరగతి విద్యార్థి విస్సనపల్లి హర్షితారాణి ద్వితీయ బహుమతి, ఆంగ్లంలో మూడో తరగతి విద్యార్థి వేముల పాద్వి తృతీయ బహుమతి, విజ్ఞాన శాస్త్రం విభాగంలో ఐదో తరగతి విద్యార్థి మాగంటి మొహిష్య నాలుగో బహుమతి, జనరల్ నాలెడ్జ్ విభాగంలో ఐదో తరగతి విద్యార్థి మలకలపల్లి గుణ వెంకటసాయి వర్ధన్ నాలుగో బహుమతి, ఆప్టిట్యూడ్ విభాగంలో ఆరో తరగతి విద్యార్థి జస్వంత్‌గుప్తా ఐదో బహుమతి సాధించారని తెలిపారు. అలాగే 108 మందికి బంగారు పతకాలు, ఆరుగురికి ప్రత్యేక బహుమతులు, 53 మందికి కన్సోలేషన్ బహుమతులు పొందారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల రీజనల్ ఇన్‌ఛార్జి రామకృష్ణ, జోనల్ కోఆర్డినేటర్ ఉదయభాస్కర్, డీన్ మధుబాబు, ప్రైమరీ ఇన్‌ఛార్జి జాన్సీ, ఉపాధ్యాయులు అభినందించారు.

పదో తరగతి పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశకి - ఏలూరు

వచ్చేనెల మూడో తేదీ నుంచి 18వ తేదీ వరకు జరగనున్న పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. బుధవారం విశాఖపట్నం కలెక్టరేట్ నుంచి రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌తో కలిసి జిల్లా కలెక్టర్లతో, విద్యాశాఖ అధికారులతో పదోతరగతి పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎస్‌పి.రాహుల్ దేవ్ శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 26,217 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలు రాసేందుకు వీలుగా 120 కేంద్రాలను నిర్వహిస్తున్నామన్నారు. 3,699 మంది ప్రయివేటు విద్యార్థులు పరీక్షలు రాసేందుకు 17 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని అందులో పదోతరగతి ఓపెన్ స్కూల్ పరీక్షలకు ఆరు సెంటర్లు, ఇంటర్ ఓపెన్ పరీక్షలకు 11 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెగ్యులర్ పదోతరగతి పరీక్ష నిర్వహణకు ఇన్విజిలేటర్లు 1306 మందిని, ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఆరుగురు, సిటింగ్ స్క్వాడ్స్ సి.సెంటర్స్ 21 మందిని, కస్టోడియన్స్ 66 మంది, ఛీఫ్ సూపరింటెండెంట్స్ 120 మంది, డిపార్ట్‌మెంట్స్ ఆఫీసర్లు 120 మంది, అదనపు డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు 18 మందిని ఏర్పాటు చేశామన్నారు. 12 రూట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పోలవరం నిర్వాసితులకు ఆదివాసీల భూములివ్వొద్దు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం


ధర్నా చేస్తున్న ఆదివాసీలు

ఆదివాసీల సాగులో ఉన్న భూములను పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు సేకరించి ఇవ్వొద్దని కోరుతూ కోటరామచంద్రాపురం ఐటిడిఎ వద్ద ఎపి వ్యవసాయ వృత్తిదారుల యూనియన్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. చంద్రాయగూడెం, రాయిగూడెం, కోయరాజమండ్రి గ్రామాల ప్రజలు ధర్నా నిర్వహించి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎపి వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల బాబ్జీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల ప్రధానకార్యదర్శి పొడియం కొవ్వాడయ్య, చంద్రాయిగూడెం, రాయిగూడెం, కోయరాజమండ్రి గ్రామస్తులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల వాడకంతో ఆరోగ్యం

ఏలూరులో పోషణ్ పఖ్వాడా ర్యాలీ

ప్రజాశక్తి - ఏలూరు

మెరుగైన పోషకాహారాలు, మంచి ఆరోగ్యం, పరిశుభ్రత, చిరుధాన్యాల ప్రాముఖ్యత, రక్తహీనత నివారణ వంటివాటిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు చేరువ చేయాలని డిఆర్‌ఒ ఎవిఎన్ఎస్.మూర్తి తెలిపారు. బుధవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మార్చి 20 నుండి ఏప్రిల్ మూడో తేదీ వరకూ సాంప్రదాయ చిరుధాన్యాల పోషకాహారాలపై అవగాహన కార్యక్రమాల నిర్వహణలో భాగంగా స్థానిక ఇండోర్ స్టేడియంలో పోషణ దీపాన్ని వెలిగించడం, పాఠశాల, కళాశాల విద్యార్థులను కలుపుకుని వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో జిల్లాస్థాయి 2కె రన్ ర్యాలీని డిఆర్‌ఒ మూర్తి, ఆర్‌డిఒ కె.పెంచల కిషోర్‌తో కలిసి ప్రారంభించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ, అభివృద్ధి శాఖ అధికారి కెఎవిఎల్.పద్మావతి మాట్లాడుతూ జిల్లాలో పోషణ్ పఖ్వాడా ద్వారా మార్చి 20 నుంచి ఏప్రిల్ మూడో తేదీ వరకూ సాంప్రదాయ చిరుధాన్యాలు, పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 30న పంచాయతీల పరిధిలో వంటల పోటీలు, ఏప్రిల్ మూడో తేదీన అన్నిస్థాయిల్లో ముగింపు వేడుకలు నిర్వహిస్తూ అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్త్ బేబీ షో నిర్వహిస్తామని తెలిపారు.

ముసునూరు: పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు అంగన్‌వాడి కేంద్రాల్లో చిరుధాన్యాలు, తృణధ్యానాలపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పి.రాజకుమారి, మేరి సులోచన, సునీత, సుజాత, అంగన్‌వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.